## మరోసారి సుస్మిత సంచలన వ్యాఖ్యలు




అక్షరశక్తి, హైదరాబాద్ : రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత సీఎం రేవంత్ రెడ్డిపై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె రేవంత్ రెడ్డిపై మరోసారి విరుచుకు పడ్డారు. తాను కాంగ్రెస్ పార్టీని విమర్శించలేదుని, రేవంత్ రెడ్డిని లక్ష్యంగా విమర్శించానని సమర్థించుకున్నారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ఖర్గే, వేణుగోపాల్, మీనాక్షి మేడం అంటే గౌరవం ఉందని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, అతని సోదరులు విపరీతమైన అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. అందుకే అతన్ని టార్గెట్ చేశానని పేర్కొన్నారు.


# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

శుక్రవారం 21 ఆగస్టు 2026 వరంగల్ సంపుటి: 20 సంచిక: 289 పేజీలు 06


# ఆ అవమానమే ఎమ్మెల్యేను చేసింది!

- ఉమ్మడి కుటుంబంలో విలువలతో పెరిగాను
- మంచి వ్యాపారవేత్తగా ఎదగాలని అనుకున్నా..
- కార్యకర్తలు, యూనియన్లే నా బలం
- కొందరికి రిటర్న్ గిఫ్ట్ ఉంటుంది
- మళ్లీ ఎమ్మెల్యే అవుతా
- డిజిటల్ మీడియాతో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ చిట్‌చాట్



2



కార్మిక సంఘాలు... మానవ సంబంధాలే బలం




అన్నీ అనుకున్నట్టు జరగవు. తానొకటి తలిస్తే...దైవం ఒకటి ఇచ్చింది. మొదటగా రాజకీయ నాయకుడు కావాలనే ఆలోచన లేదు. తాను మంచి వ్యాపారవేత్తగా ఎదగాలి... అన్నయ్య ఎమ్మెల్యే కావాలని, ఆయనకు తోడుగా ఉండాలని అనుకున్నాడు. కానీ జరిగింది వేరే అని మాజీ ఎమ్మెల్యే, మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. హైదరాబాద్‌లో ఎదురైన ఓ అవమానకర ఘటన తన జీవితాన్ని మలుపు తిప్పిందని, ఎమ్మెల్యే కావాలనే కసిని రేపిందని చెప్పారు. ఓటమి నుంచి గెలుపు వరకు, తెలంగాణ ఉద్యమం నుంచి ప్రజా జీవితంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే వరకు సాగిన తన రాజకీయ ప్రస్థానాన్ని డిజిటల్ మీడియాతో శుక్రవారం జరిగిన చిట్‌చాట్‌లో ఆయన పంచుకున్నారు. - అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి




# మంత్రి కొండా సురేఖను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

- రేవంత్ నిర్ణయాలను వ్యతిరేకించే వాళ్లకి పార్టీలో ఉండే అర్హత లేదు
- 18మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్

6

## ఏసీబీకి పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి



అక్షరశక్తి, మంచిర్యాల : మంచిర్యాల జిల్లాలో శుక్రవారం నాడు పంచాయతీ కార్యదర్శి ఏసీబీకి పట్టుబడ్డారు. జిల్లాలోని జన్నారం మండలంలో శుక్రవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. లింగయ్యపల్లె గ్రామపంచాయితీ కార్యదర్శి వరలక్ష్మి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఓ వ్యక్తి ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం రూ.11 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు రావడంతో ఏసీబీ అధికారులు మాటువేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తీసుకున్న లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు ఆమెపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

21-08-2026_Layout 1 21-08-2026 19:09 Page 2





# ఆ అవమానమే ఎమ్మెల్యేను చేసింది!

- ఉమ్మడి కుటుంబంలో విలువలతో పెరిగాను
- మంచి వ్యాపారవేత్తగా ఎదగాలని అనుకున్నా..
- కార్యకర్తలు, యూనియన్లే నా బలం
- మళ్లీ ఎమ్మెల్యే అవుతా.. కొందరికి రిటర్న్ గిఫ్ట్ ఉంటుంది
- డిజిటల్ మీడియాతో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ చిట్‌చాట్



**అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి:**

అన్నీ అనుకున్నట్టు జరగవు. తానొకటి తలిస్తే...దైవం ఒకటి ఇచ్చింది. మొదటగా రాజకీయ నాయకుడు కావాలనే ఆలోచన లేదు. తాను మంచి వ్యాపారవేత్తగా ఎదగాలి... అన్నయ్య ఎమ్మెల్యే కావాలని, ఆయనకు తోడుగా ఉండాలని అనుకున్నాడు. కానీ జరిగింది వేరే అని మాజీ ఎమ్మెల్యే, మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. హైదరాబాద్‌లో ఎదురైన ఓ అవమానకర ఘటన తన జీవితాన్ని మలుపు తిప్పిందని, ఎమ్మెల్యే కావాలనే కసిని రేపిందని చెప్పారు. ఓటమి నుంచి గెలుపు వరకు, తెలంగాణ ఉద్యమం నుంచి ప్రజా జీవితంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే వరకు సాగిన తన రాజకీయ ప్రస్థానాన్ని డిజిటల్ మీడియాతో శుక్రవారం జరిగిన చిట్‌చాట్‌లో ఆయన పంచుకున్నారు.

### ఉమ్మడి కుటుంబం..

తమది పెద్ద ఉమ్మడి కుటుంబమని, విలువలు, సంప్రదాయాలతో పెరిగామని వినయ్ భాస్కర్ తెలిపారు. తండ్రి విద్యుత్ శాఖలో ఉద్యోగం చేసేవారని, చిన్నతనంలో అన్నలు, అక్కలు, తమ్ముళ్లతో కలిసి వడ్డేపల్లిలోని ఇంట్లో ఉండేవారమన్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి ఉండే వాతావరణం తమకు జీవిత విలువలను నేర్పిందన్నారు. యువకుడిగా ఉన్న సమయంలో తాను మంచి వ్యాపారవేత్త కావాలని, తన అన్న దాస్యం ప్రణయ్ భాస్కర్ ఎమ్మెల్యే కావాలని అనుకునేవారని చెప్పారు. మొదట టెంట్ హౌస్ నిర్వహించడంతో పాటు పలు ఏజెన్సీలు తీసుకుని వ్యాపార రంగంలో అడుగులు వేశానన్నారు. అప్పట్లో ఇప్పటిలా ఆన్‌లైన్ షాపులు, ఇన్‌స్టా మార్టులు లేకపోవడంతో ఏజెన్సీ లైసెన్సులు తీసుకుని వ్యాపారం చేసేవాడినని తెలిపారు.

### అన్నయ్య రాజకీయాల్లో.. తాను తెరవెనుక

తన అన్నయ్య ప్రణయ్ భాస్కర్ రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారని, తాను మాత్రం ఆయనకు తెరవెనుక నుంచి సహకరించేవాడినని వినయ్ భాస్కర్ తెలిపారు. 1984లో ప్రణయ్ భాస్కర్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన తర్వాత ప్రజలతో సంబంధాలను బలోపేతం చేసేందుకు పలు సంఘాలను ఏర్పాటు చేశామని చెప్పారు. 1994లో అన్నయ్య ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యారని, అప్పటి నుంచి ఏర్పడిన సంఘాలు తమ కుటుంబానికి ఇప్పటికీ అండగా ఉన్నాయని తెలిపారు. అయితే అన్నయ్య అకాల మరణంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. ఆ సమయంలో తనకు రాజకీయాలపై ఆసక్తి లేదని, కుటుంబం, వ్యాపారంపైనే దృష్టి పెట్టాలని భావించానన్నారు.

### ఆ ఒక్క అవమానమే రాజకీయాల్లోకి తెచ్చింది

అన్నయ్య మరణం తర్వాత అమ్మ, నాన్న, వదిన, పిల్లలతో కలిసి హైదరాబాద్ వెళ్లిన సందర్భంలో తన జీవితంలో కీలకమైన ఘటన జరిగిందని వినయ్ భాస్కర్ తెలిపారు. అన్నయ్యకు కేటాయించిన ఎమ్మెల్యే క్వార్టర్‌కు వెళ్లగా, అప్పటికే గదికి సీల్ వేసి ఉందన్నారు. తండ్రికి తెలియకుండా కీలు తీసుకురావాలనే ఉద్దేశంతో క్వార్టర్ నిర్వహణ చూసే అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను కలిసిన సమయంలో ఆయన తమను అవమానించారని చెప్పారు. "మీరు ఓడిపోయారు కదా" అంటూ దారుణంగా మాట్లాడటంతో తాను తీవ్రంగా బాధపడ్డానన్నారు. ఆ ఘటన అనంతరం పోలీసులు తనను తీసుకెళ్లారని, అప్పట్లో టీడీపీలో మంత్రిగా ఉన్న చందూలాల్ కలుగజేసుకుని పోలీస్ స్టేషన్ నుంచి విడిపించారని తెలిపారు. ఆ అవమానం తనలో తీవ్ర కసిని రేపిందని, "పదవి లేకుంటే ఇంత అవమానిస్తారా?" అనే ఆలోచన తనను వెంటాడిందన్నారు. ఎమ్మెల్యే అయిన తర్వాతే మళ్లీ వస్తానని అప్పుడే మనసులో నిర్ణయించుకున్నానని చెప్పారు.

### ఓటమి.. 35 వేల ఓట్లు

టీడీపీ టికెట్ దక్కని పరిస్థితుల్లో 1999లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి సుమారు 35 వేల ఓట్లు సాధించానని వినయ్ భాస్కర్ తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తనకు మంచి ఓటు వాటా వచ్చిందన్నారు. 2004లో ఎలాగైనా ఎమ్మెల్యే కావాలని నిర్ణయించుకున్న సమయంలో టీడీపీ--బీజేపీ పొత్తు కారణంగా తన స్థానాన్ని త్యాగం చేయాలని చంద్రబాబు నాయుడు సూచించారని చెప్పారు. అయితే తన మనస్సాక్షి స్వతంత్రంగా పోటీ చేయాలని చెప్పిందన్నారు. తనతో పాటు మరో పది మంది కూడా తన బాటలో పయనించేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. తర్వాత చంద్రబాబు నాయుడు పిలిపించి పోటీ నుంచి తప్పుకోవాలని కోరారని, "ప్రపంచం అంతా నన్ను చూస్తోంది.. నేను మాత్రం నిన్ను చూస్తున్నాను" అంటూ తనను ఒప్పించే ప్రయత్నం చేశారని చెప్పారు. అయినప్పటికీ తాను ససేమిరా ఒప్పుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని, ప్రచారానికి వెళ్లకుండా కేసులు పెట్టినా ధైర్యంగా ఎదుర్కొన్నానని తెలిపారు. చివరకు కేవలం 1,400 ఓట్ల తేడాతో ఓడిపోయానన్నారు. తన ధైర్యానికి కారణం కార్యకర్తలు, ప్రజలేనని చెప్పారు.

### కేసీఆర్‌తో ఉద్యమ ప్రయాణం

తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన సమయంలో 2005లో కేసీఆర్ తనను హైదరాబాద్ పిలిపించారని వినయ్ భాస్కర్ తెలిపారు. తనతో కలిసి ప్రయాణం చేయాలని కేసీఆర్ కోరారని, అలా టీఆర్ఎస్‌తో తన రాజకీయ ప్రయాణం ప్రారంభమైందన్నారు. తొలుత కార్పొరేటర్‌గా పోటీ చేస్తే పట్టణ ప్రాంతంలో పట్టు సాధించవచ్చని కేసీఆర్ సూచించారని చెప్పారు. ఆ తర్వాత పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, తెలంగాణ ఉద్యమంలో మడమ తిప్పని పోరాటం చేయడం ద్వారా ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకున్నా అని అన్నారు.

### పార్టీ కార్యాలయం ప్రారంభించిన రోజే టికెట్ ఖరారు

టీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కేయూ జంక్షన్ సమీపంలో పార్టీ కార్యాలయం కోసం భవనాన్ని అద్దెకు తీసుకున్నానని తెలిపారు. కేసీఆర్ చేతుల మీదుగా కార్యాలయాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. కొందరు తనపై లేనిపోని విషయాలు చెప్పి కేసీఆర్‌ను కార్యాలయానికి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. తాను స్వయంగా వెళ్లి కేసీఆర్‌ను ఆహ్వానించగా, చివరకు ఆయన వచ్చి కార్యాలయాన్ని ప్రారంభించారని తెలిపారు. కార్యాలయం ఏర్పాటుకు తాను పడిన కష్టాన్ని, తనకు ఉన్న ప్రజాబలాన్ని కేసీఆర్ గుర్తించి అభినందించారని, అక్కడే తనకు పార్టీ టికెట్ ఖరారైందన్నారు.

### కార్మిక సంఘాలు... మానవ సంబంధాలే బలం

2004 ఓటమి తర్వాత ప్రజలు, కార్మికులు, వివిధ సంఘాలతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకున్నానని వినయ్ భాస్కర్ తెలిపారు. 44 సంఘాలతో కార్మిక ఐక్య వేదిక ఏర్పాటు చేసి వారి సమస్యల్లో భాగస్వామిగా మారానన్నారు. "నేను ఆర్థిక సంబంధాలతో కాదు.. మానవ సంబంధాలతో గెలిచాను" అని ఆయన పేర్కొన్నారు. కార్మిక, సహకార సంఘాలంటే తనకు ప్రత్యేక అభిమానమని, వాటి కష్టసుఖాల్లో ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. ఈ సంబంధాలే తనకు ప్రధాన బలమని చెప్పారు.

### కల్పలతతో విడదీయరాని అనుబంధం

వరంగల్ సెంట్రల్ జైలు ఎదురుగా ఉన్న కల్పలత సూపర్ బజార్‌తో చిన్ననాటి నుంచే తనకు ప్రత్యేక అనుబంధం ఉందని వినయ్ భాస్కర్ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కల్పలత సూపర్ బజార్లను మూసివేసేందుకు ప్రయత్నాలు జరిగినప్పుడు అడ్డుకున్నానన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కల్పలతపై ఉన్న అప్పును మాఫీ చేయించడంతో పాటు సభ్యత్వాలను పెంచి, అన్ని వర్గాలతో కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. పెట్రోల్ బంక్ ప్రారంభించి, వచ్చిన ఆదాయాన్ని వినియోగదారులకు చేరేలా లాటరీల ద్వారా బహుమతులు కూడా అందించామని తెలిపారు. అయితే ప్రస్తుతం కల్పలత సూపర్ బజార్‌లో అవినీతి జరిగిందని, దానికి తానే కారణమంటూ కొందరు బురదజల్లుతున్నారని ఆరోపించారు.

### ఉద్యమకారులకు అండగా.. .

తన తల్లి ఎప్పుడూ చేసిన దానం గుప్తంగా ఉండాలని చెప్పేవారని, ఆ మాటను ఇప్పటికీ పాటిస్తున్నానని వినయ్ భాస్కర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో తనతో కలిసి పోరాడి మరణించిన వారి కుటుంబాలకు, కేసులతో ఇబ్బందులు ఎదుర్కొన్న వారికి, గాయపడిన వారికి ఆర్థికంగా సహాయం చేశానన్నారు. కనీసం రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు సాయం చేసిన సందర్భాలు ఉన్నాయని, రైల్వే కేసులతో ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యమకారులకు రూ.5 లక్షల చొప్పున సహాయం చేశానని తెలిపారు. తాను చేసిన సాయాన్ని ఇప్పటివరకు ఎవరికీ చెప్పుకోలేదన్నారు. "కుడిచేతితో చేసిన సాయం ఎడమ చేతికి కూడా తెలియకూడదు" అనేది తన తల్లి చెప్పిన మాట అని గుర్తుచేశారు.

### రాజకీయంగానే ఎదుర్కొంటా....

నేను ఎప్పుడూ ప్రతీకార రాజకీయాలు చెయ్యలేదు. తన రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగానే ఎదుర్కొంటానని, వారి వ్యక్తిగత, కుటుంబ వ్యవహారాల్లోకి వెళ్లడం తనకు ఇష్టం ఉండదని వినయ్ భాస్కర్ స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ ప్రతీకార రాజకీయాలు చేయలేదన్నారు. కరోనా సమయంలో తాను అధికార పార్టీలో ఉన్నప్పటికీ రాజకీయ భేదాలు చూడకుండా కాంగ్రెస్ నాయకులకు కూడా మందులు, ఇంజెక్షన్లు అందించిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. తనపై కబ్జాల ఆరోపణలు చేయడంతో పాటు స్విస్ బ్యాంకులో రూ.2 వేల కోట్లు దాచుకున్నానంటూ ప్రచారం చేశారని, అవి నిరూపించాలని సవాల్ చేశారు. పార్టీలో తనపై బురదజల్లేందుకు పలువురు ప్రయత్నాలు చేశారని ఆరోపించారు.

### 2029లో మళ్లీ ఎమ్మెల్యేనే..

తాను సీరియస్ పొలిటికల్ లీడర్‌నని, వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని వినయ్ భాస్కర్ స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో ఖచ్చితంగా విజయం సాధిస్తానన్న ధీమా వ్యక్తం చేశారు. తన ఓటమికి గల కారణాలను ఇప్పటికే గుర్తించానని, వాటిని సరిదిద్దుకునే పనిలో ఉన్నానన్నారు. 2029లో విజయం సాధించిన తర్వాత తన "రిటర్న్ గిఫ్ట్" ఉంటుందని, అది చిల్లర రాజకీయాలతో కాకుండా తన పని తీరుతోనే వారికి సమాధానం ఉంటుందని పేర్కొన్నారు.

# పిల్లల చేతుల్లో కత్తులు కాదు.. కలాలు ఉండాలి

నల్గొండ జిల్లాలో ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్య ఘటన ప్రతి ఒక్కరి హృదయాన్ని కలచివేస్తోంది. ఒక ఉపాధ్యాయురాలు తన విద్యార్థుల భవిష్యత్తు కోసం మందలించినందుకు, అదే విద్యార్థులు ఆమెపై కక్ష పెంచుకుని ఇంతటి దారుణానికి పాల్పడ్డారన్న విషయం మరింత బాధాకరం. పదో తరగతి చదువుతున్న వయసులోనే ఇలాంటి ఆలోచనలు, ఇంతటి క్రూరత్వం పిల్లల మనసుల్లోకి ఎలా వచ్చిందన్న ప్రశ్న ఇప్పుడు ప్రతి తల్లిదండ్రి, ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి ఒక్క సామాజికవేత్తను ఆలోచింపజేయాలి.

ఒకప్పుడు ఉపాధ్యాయుడు మందలిస్తే పిల్లలు తప్పును సరిదిద్దుకునేవారు. తల్లిదండ్రులు నాలుగు మాటలు చెబితే వాటిని జీవితానికి మార్గదర్శకంగా తీసుకునేవారు. కానీ నేడు కొందరు పిల్లలు మందలింపును అవమానంగా భావిస్తున్నారు. కోపాన్ని కక్షగా మార్చుకుంటున్నారు. చిన్న విషయాన్నే ప్రతీకారంగా తీసుకుంటున్నారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, చెడు స్నేహాలు, హింసాత్మక ఆలోచనలు, వ్యసనాల ప్రభావం, డబ్బుపై మోజు వంటి అంశాలు వారి ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయా అనే విషయాన్ని మనం గమనించాల్సిన అవసరం ఉంది.

పిల్లలకు చదువు, మంచి బట్టలు, ఖరీదైన ఫోన్లు, అవసరానికి మించి డబ్బు ఇవ్వడం మాత్రమే తల్లిదండ్రుల బాధ్యత కాదు. వారి మనసులో ఏం జరుగుతుందో తెలుసుకోవడం, వారి స్నేహితులు ఎవరో గమనించడం, వారి ప్రవర్తనలో వస్తున్న మార్పులను గుర్తించడం, తప్పు చేసినప్పుడు మందలించడంతో పాటు ఎందుకు తప్పు చేస్తున్నారో అర్థం చేసుకోవడం కూడా తల్లిదండ్రుల బాధ్యతే. రోజుకు కొన్ని నిమిషాలైనా పిల్లలతో ప్రేమగా మాట్లాడితే వారి మనసులోని ఎన్నో సమస్యలు బయటకు వస్తాయి. మనం పిల్లల కోసం సమయం కేటాయించకపోతే, వారి జీవితాన్ని ప్రభావితం చేసే ఇతర శక్తులకు ఆ స్థానం దక్కే ప్రమాదం ఉంది.

అలాగే పాఠశాలలు కేవలం మార్కులు, ర్యాంకులు సాధించే కేంద్రాలుగా కాకుండా పిల్లల్లో మానవత్వం, క్రమశిక్షణ, బాధ్యత, సహనం, కోప నియంత్రణ, పెద్దల పట్ల గౌరవం వంటి విలువలను పెంపొందించే ప్రదేశాలుగా ఉండాలి. ఒక విద్యార్థి ప్రవర్తనలో అకస్మాత్తుగా మార్పు కనిపించినప్పుడు దానిని నిర్లక్ష్యం చేయకుండా తల్లిదండ్రులకు తెలియజేసి, అవసరమైతే కౌన్సెలింగ్ అందించే విధానం ప్రతి పాఠశాలలో ఉండాలి.

రూపారెడ్డి మరణం ఒక కుటుంబానికి తీరని విషాదం మాత్రమే కాదు.. సమాజం మొత్తం ఆలోచించాల్సిన ఒక హెచ్చరిక. ఒక ఉపాధ్యాయురాలి చేతిలో పిల్లల భవిష్యత్తు ఉండాలి కానీ, పిల్లల చేతిలో ఒక ఉపాధ్యాయురాలి ప్రాణం పోయే పరిస్థితి రావడం మనందరికీ సిగ్గుపడే విషయం. ఈ ఘటనను కేవలం ఒక హత్యగా చూసి, నిందితులను శిక్షిస్తే సమస్య పూర్తవుతుందని అనుకోవడం సరిపోదు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా మన కుటుంబాల్లో, మన పాఠశాలల్లో, మన సమాజంలో మార్పు రావాలి.

పిల్లల చేతుల్లో కత్తులు కాదు.. కలాలు ఉండాలి. వారి కళ్లలో కక్ష కాదు.. కలలు ఉండాలి. వారి మనసుల్లో ద్వేషం కాదు.. మానవత్వం ఉండాలి. పిల్లలను పెంచడం అంటే వారికి జీవిత సౌకర్యాలు అందించడం మాత్రమే కాదు.. మంచి మనిషిగా తీర్చిదిద్దడం. రూపారెడ్డి గారి దారుణ హత్య మనందరికీ ఒక గట్టి మేలుకొలుపు కావాలి. ఇకనైనా ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలతో మాట్లాడాలి, ప్రతి ఉపాధ్యాయుడు వారి మనసును అర్థం చేసుకోవాలి, ప్రతి పాఠశాల పిల్లల మానసిక ఆరోగ్యం, ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. లేదంటే మనం కళ్లముందే ఒక తరాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది.

రూపారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ.. ఆమె మరణం మరొక కుటుంబానికి ఇలాంటి కన్నీటిని మిగల్చకుండా సమాజంలో మార్పుకు నాంది కావాలని ఆశిద్దాం. ఇది కేవలం ఒక హత్య కాదు.. ప్రతి ఇంటి తలుపు తట్టి మనల్ని మేల్కొలుపుతున్న ఒక హెచ్చరిక. మన పిల్లల భవిష్యత్తును మనమే కాపాడుకోవాలి.



- నిమ్మల శ్రీనివాస్
**సామాజికవేత్త**
**9949709866.**

# సాంకేతికతతో మెరుగైన విద్యుత్ సేవలు




**అక్షరశక్తి,హన్మకొండ:** వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో గణనీయమైన పురోగతి సాధిస్తున్నామని ఇంధన శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. హన్మకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు, చీఫ్ జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు. సంస్థ ప్రగతి, డిజిటల్ సేవలు, రెవెన్యూ పరిరక్షణ తదితర అంశాలపై సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. టీజీఎన్పీడీసీఎల్‌లో వినియోగదారులకు విద్యుత్ సేవలను మరింత సులభంగా, వేగంగా, పారదర్శకంగా అందించేందుకు ప్రవేశపెట్టిన వాట్సాప్ చాట్‌బాట్‌కు మంచి స్పందన లభిస్తోందని సీఎండీ తెలిపారు. డిజిటల్ సేవల ద్వారా ఫిర్యాదుల పరిష్కారంలోనూ మెరుగైన పనితీరు సాధిస్తున్నామని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయ్ సపోర్ట్ బాట్‌ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. రెవెన్యూ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సీఎండీ తెలిపారు. విద్యుత్ చౌర్యం, తక్కువ బిల్లింగ్, అదనపు లోడ్ తదితర లోపాలను గుర్తించేందుకు డీపీఈ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న విశ్లేషణ ప్రక్రియను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, "సాంకేతికతతో మెరుగైన సేవలు, పారదర్శకతతో పరిపాలన, డేటా విశ్లేషణతో సరైన నిర్ణయాలు, వేగవంతమైన పరిష్కారం" అనే దిశగా విద్యుత్ శాఖ మరింత ముందుకు సాగుతోందన్నారు.

సమావేశంలో డైరెక్టర్లు వి. తిరుపతి రెడ్డి, టి. మధుసూదన్, సి. ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్లు కె. తిరుమల్ రావు, అశోక్, కె. వెంకట రమణ, సురేందర్, గౌతమ్ రెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్లు చరణ్ దాస్, కిషన్, వేణు బాబు, జనరల్ మేనేజర్లు ప్రభావతి, శ్రీనివాస్, కళాధర్ రెడ్డి, జయరాజ్, వెంకట కృష్ణ, డీఈ కె. అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుపై దాడిని ఖండిస్తూ నిరసన

**అక్షరశక్తి,చిట్యాల:** భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలానికి చెందిన జర్నలిస్ట్ పుల్ల రవీందర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం చిట్యాల అంబేద్కర్ సెంటర్‌లో ఆయన కుటుంబ సభ్యులు చేపట్టిన నిరసనకు తెలంగాణ క్రాంతి దళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సంఘం రెడ్డి పృథ్వీరాజ్ యాదవ్ సంఘీభావం తెలిపారు. రవీందర్ ఇంటిపై దాడి చేసి గాయపరిచిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని పృథ్వీరాజ్ యాదవ్ డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులను తీవ్రంగా ఖండిస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలు, కుల సంఘాల నాయకులు, జర్నలిస్టులు పాల్గొని మద్దతు తెలిపారు.






# ట్రాఫిక్ రద్దీ నివారణకు ఫ్రీ లెఫ్ట్‌ల ఏర్పాటు

**అక్షరశక్తి,వరంగల్:** వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ ఎల్అండ్ఓ రాయల ప్రభాకర్, ఏసీపీ ట్రాఫిక్ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో, కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీ పి. వెంకన్న ఆధ్వర్యంలో ట్రాఫిక్ రద్దీ నివారణకు పలు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కాజీపేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) సహకారంతో ఈ రోజు ఆదాలత్ జంక్షన్‌లో మూడు వైపులా, ఫారెస్ట్ ఆఫీస్ జంక్షన్‌లో ఒక వైపు మొత్తం 54 సిమెంట్ బ్లాక్‌లను ఏర్పాటు చేసి ఫ్రీ లెఫ్ట్ మార్గాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

21-08-2026_Layout 1 21-08-2026 19:09 Page 4



# రహదారి సామర్థ్యాన్ని ఇట్టే పసిగడుతుంది

**ఎన్ఐటి డిపార్ట్మెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ ఎస్.శంకర్, బృందం (ట్రాన్స్పోర్టేషన్ ఇంజనీరింగ్ ప్రోగ్రాం) ద్వారా పరిశోధనతో అందుబాటులోకి లేటెస్ట్ టెక్నాలజీ**

**అందుబాటులోకి రూ.30 కోట్లతో భారత దేశంలోనే తొలి ఎల్డీడీ వాహనం**







రోడ్ల నాణ్యత, పటిష్ఠతను ఇకపై వాహనాన్ని నిలిపి పరీక్షించాల్సిన అవసరం లేకుండానే అంచనా వేయవచ్చు. వరంగల్ ఎన్ఐటి ప్రొఫెసర్ శంకర్, బృందం సుమారు రెండేళ్లపాటు చేసిన పరిశోధన విజయవంతమైంది. లేజర్ డైనమిక్ డిఫ్లెక్టోమీటర్ (ఎల్డీడీ) సాంకేతికత భారతదేశంలోని తొలి టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ఈ ప్రత్యేక వాహనానికి అమర్చిన లేజర్ సెన్సర్లు రోడ్డు ఉపరితలంపై వాహన చక్రాల ప్రభావంతో ఏర్పడే స్వల్ప కుంగుదలను కదులుతూనే గుర్తిస్తాయి. ఈ విధానం నిరంతరంగా, వేగంగా రహదారిని పరిశీలించేందుకు వీలు కల్పిస్తుంది.

### లేజర్ ఎలా పనిచేస్తుంది?

ఎల్డీడీలో లేజర్ డాప్లర్ వైబ్రోమీటర్లు అమర్చుతారు. ఇవి రోడ్డు ఉపరితలంపై లేజర్ కిరణాలను ప్రసరించి, తిరిగి వచ్చే కాంతిలో ఏర్పడే డాప్లర్ ఫ్రీక్వెన్సీ మార్పును విశ్లేషిస్తాయి. దీని ద్వారా ఉపరితలం ఏ వేగంతో పైకి, కిందికి కదులుతోందో గుర్తించవచ్చు. వాహనం ప్రయాణిస్తున్న వేగం వల్ల ఏర్పడే ప్రభావాన్ని కూడా గణనలోకి తీసుకుని అసలు రోడ్డు కుంగుదల వేగాన్ని లెక్కిస్తారు.

### వాహనం కదులుతున్నా.. కొలతల్లో కచ్చితత్వం

రోడ్డు అసమానతలు, వాహనం సస్పెన్షన్ కారణంగా కొలిచే వ్యవస్థకు స్వల్పంగా పైకి, కిందికి లేదా ముందుకు, వెనుకకు కదలికలు ఏర్పడతాయి. ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు జైరోస్కోప్, ఇనర్షియల్ కొలతలు, యాక్సిలరోమీటర్ల సహాయంతో వాహనం కదలికలను గుర్తించి డేటాకు సవరణలు చేస్తారు. అనంతరం రహదారి ఉపరితలంపై నిజంగా ఏర్పడిన విక్షేపాన్ని గణిస్తారు.

### రోడ్డు ఎక్కడ బలహీనంగా ఉందో గుర్తింపు

వాహన చక్రం రోడ్డుపై భారాన్ని మోపినప్పుడు ఉపరితలం స్వల్పంగా కుంగుతుంది. ఈ కుంగుదల చక్రం చుట్టూ ఏర్పడే ప్రాంతాన్ని డిఫ్లెక్షన్ బౌల్గా పరిగణిస్తారు. ఎల్డీడీ పలు లేజర్ సెన్సర్ల ద్వారా ఈ ప్రాంతంలోని వివిధ బిందువుల కదలికలను కొలుస్తుంది. సేకరించిన డేటాను రహదారి పొరల స్థితి, స్థితిస్థాపకతకు సంబంధించిన గణిత నమూనాలతో విశ్లేషించి రోడ్డు నిర్మాణ సామర్థ్యాన్ని అంచనా వేస్తారు.

### గంటల తరబడి కాకుండా.. కదులుతూనే పరీక్ష

సాంప్రదాయంగా రోడ్డు డిఫ్లెక్షన్ను తెలుసుకునేందుకు బెంకెల్మన్ బీమ్, ఫాలింగ్ వెయిట్ డిఫ్లెక్టోమీటర్ (ఎఫ్డబ్ల్యూడీ) వంటి పద్ధతులు ఉపయోగిస్తారు. వీటితో పోలిస్తే ఎల్డీడీ ప్రధాన ప్రత్యేకత వాహనం సాధారణ రహదారి వేగంతో కదులుతూనే నిరంతరంగా డేటాను సేకరించడం. దీంతో పెద్ద రహదారి నెట్వర్క్ను తక్కువ సమయంలో సర్వే చేయడానికి అవకాశం ఉంటుంది.

### ఒకే వాహనంతో.. అనేక రకాల సమాచారం

సెప్టాగాన్ ఆసియా వివరాల ప్రకారం ఎల్డీడీ ఆధారిత వ్యవస్థను ఇతర రహదారి సర్వే సాంకేతికతలతో కలిపి ఉపయోగించవచ్చు. రహదారి ఉపరితల లోపాలు, స్మూత్నెస్, నిర్మాణ స్థితి, జీపీఆర్ ఆధారిత భూగర్భ సమాచారం, డిఫ్లెక్షన్ వంటి డేటాను సమీకరించే విధంగా వ్యవస్థను రూపొందించవచ్చు. రియల్టైమ్ సిగ్నల్ ప్రాసెసింగ్, డేటా అవుట్పుట్, నివేదికల తయారీ వంటి సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నట్లు సంస్థ పేర్కొంది.

### రోడ్డు మరమ్మతులకు శాస్త్రీయ ఆధారం

ఎక్కడ రోడ్డు బలహీనంగా ఉంది? ఎక్కడ పునరుద్ధరణ అవసరం? ఏ ప్రాంతానికి ముందుగా మరమ్మతులు చేయాలి? వంటి ప్రశ్నలకు డేటా ఆధారంగా సమాధానం పొందవచ్చు. దీంతో అవసరమైన చోటే నిర్వహణ, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు వీలు కలుగుతుంది. దీర్ఘకాలంలో రహదారి నిర్వహణ వ్యయాన్ని సమర్థంగా వినియోగించుకోవడానికి ఇది సహాయపడే అవకాశం ఉంది.

### ప్రమాదాల నివారణలోనూ కీలకం

భూగర్భ లోపాలు, రహదారి నిర్మాణంలో బలహీన ప్రాంతాల వల్ల కొన్ని చోట్ల ఉపరితలం కుంగిపోయే ప్రమాదం ఉంటుంది. ఎల్డీడీ ద్వారా గుర్తించే అసాధారణ డిఫ్లెక్షన్ ప్రాంతాలు మరింత సమగ్ర పరిశీలనకు సంకేతాలుగా ఉపయోగపడవచ్చు. ఇటీవలి పరిశోధనల్లో భూగర్భ కవాటాలు/ఖాళీలను గుర్తించడంలో ఎల్డీడీ డేటాను ఉపయోగించే అవకాశాలపై కూడా అధ్యయనాలు జరిగాయి.

### రూ.30 కోట్ల సాంకేతిక పరిజ్ఞానం

సెప్టాగాన్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ ఎల్డీడీ, ఎన్నటి వరంగల్ ఎంఓయూ కుదుర్చుకుంది. ఎల్డీడీ ఆధారిత రహదారి మూల్యాంకన వాహనాన్ని సుమారు రూ.30 కోట్ల విలువైన ప్రత్యేక సాంకేతిక వ్యవస్థగా రూపొందించారు. తాజాగా వరంగల్ ఎన్ఐటిలో ప్రదర్శించగా.. రవాణా ఇంజినీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు దీని పనితీరును పరిశీలించారు. దీంతో పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, ఫీల్డ్ డిప్లాయ్మెంట్, కన్సల్టెన్సీ, శిక్షణ, ఇంటర్న్షిప్లు, పరిశ్రమ ఆధారిత ప్రాజెక్టులకు అవకాశాలు ఏర్పడనున్నాయి. రహదారి మౌలిక వసతుల నిర్వహణలో కృత్రిమ మేధ, అధునాతన డేటా విశ్లేషణ వంటి అంశాలను అనుసంధానించే పరిశోధనలకు కూడా ఇది దోహదపడే అవకాశం ఉంది.

### భారత్లో తొలిసారిగా ఎల్డీడీ సాంకేతిక యంత్రం

లేజర్ డైనమిక్ డిఫ్లెక్టోమీటర్ (ూణఱ)ను భారత్లో తొలిసారిగా రహదారుల నిర్మాణ, ఉపరితల స్థితిని నిరంతరం అంచనా వేసే సాంకేతికతగా వినియోగిస్తున్నారు. వాహనానికి అమర్చిన లేజర్ సెన్సర్ల ద్వారా వాహనం కదులుతూనే రోడ్డు కుంగుదల, అసమానతలు, నిర్మాణ బలాన్ని కొలవడం దీని ప్రత్యేకత. భారీ స్థాయిలో రహదారుల నాణ్యతను వేగంగా, శాస్త్రీయంగా అంచనా వేసేందుకు ఇది ఉపయోగపడుతుంది. కాగా ఈ విజయం పట్ల ఎన్ఐటి డైరెక్టర్ ఆచార్య బిద్యాధర్ సుబూధి, అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు ఆచార్య శంకర్, బృందాన్ని అభినందించారు.



ఇమ్మడి ప్రసాద్
సీనియర్ జర్నలిస్ట్
హనుమకొండ
సెల్: 81438 11118



## పోలీస్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన సీపీ

**అక్షరశక్తి, కాజీపేట:** మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్ శుక్రవారం సందర్శించారు. ఈరోజు ఉదయం శిక్షణ కేంద్రాన్ని చేరుకున్న పోలీస్ కమిషనర్ కు శిక్షణా కేంద్రం పోలీస్ అధికారులు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించడంతో పాటు వివిధ అంశాలపై శిక్షణకై వచ్చే పోలీస్ అధికారులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, తరగతి గదులను పరిశీలించి.. ఈ కేంద్రం విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఇతర సిబ్బంది పనితీరును సీపీ సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ కమిషనర్ వెంట అదనపు డీసీపీ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రమణ బాబు, ఇన్స్పెక్టర్ రవికుమార్, ఆర్. ఐ సింహచలం శ్రీనివాస్, ఆర్. ఎస్. ఐ రవి తేజ తో పాటు ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

21-08-2026_Layout 1 21-08-2026 19:09 Page 5



# మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం నిర్మాణానికి భూమి పూజ

**అక్షరశక్తి,నల్లగొండ:** పట్టణంలోని స్థానిక ఎన్ఆర్ఎస్ గార్డెన్స్ సమీపంలో మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహ ట్రస్టు ఆధ్వర్యంలో భవన నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వసతి గృహ భవన నిర్మాణానికి నిధుల సేకరణలో తమ వంతు సహకారం అందిస్తామని వారు తెలిపారు. నల్లగొండ జిల్లాలోని మున్నూరు కాపు కుల బంధువులంతా నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నల్లగొండకు వచ్చి చదువుకునే విద్యార్థులకు వసతి సదుపాయం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు.



తెలంగాణ రాష్ట్రంలోని మున్నూరు కాపు ఎమ్మెల్యేలు, ఎంపీలు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల నుంచి భవన నిర్మాణానికి నిధులు సేకరిస్తామని ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు నేతి రఘుపతి, ప్రధాన కార్యదర్శి తోకల వెంకటకృష్ణ, కోశాధికారి నేతి ఉమామహేశ్వర్, తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు తుడి జనార్దన్ పటేల్, గౌరవ అధ్యక్షుడు కాటం సునీల్, ఉపాధ్యక్షుడు మేకల వెంకన్న, సహాయ కార్యదర్శి రామగిరి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు కంచనపల్లి జవహర్‌లాల్, నాగులంచ స్వామి, ట్రస్టు బోర్డు సభ్యులు వాసుదేవుల వెంకట నరసయ్య, శేషనాల రఘువీర్, వొలి సమీర్ కుమార్, గాలి వెంకటేశ్వరరావు, వైద్యం వెంకటేశ్వర్లు, కేసిడి వెంకట నరసయ్య, నాగులపల్లి శ్యాంసుందర్, జువాజీ ఇంద్రయ్య, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కోశాధికారి కంచి సత్యనారాయణ, పందిరి వేణు, వీడియో జర్నలిస్ట్ చేపూరి రవి, సంఘం నాయకులు పందిరి వెంకటేశ్వరమూర్తి, సుధాకర్, వసంత సత్యనారాయణ, పంతులు శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల హక్కులపై అవగాహన కార్యక్రమం



**అక్షరశక్తి,హనుమకొండ:** ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) హనుమకొండ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ క్యాంపస్‌లోని సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్‌లో వయోవృద్ధుల హక్కులు, వారికి అందుబాటులో ఉన్న న్యాయపరమైన రక్షణలు, సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి. రామలింగం మాట్లాడుతూ వయోవృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు, సమాజం గౌరవం, బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. హక్కుల పరిరక్షణకు చట్టపరంగా కల్పించిన రక్షణలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, అవసరమైనప్పుడు డీఎల్ఎస్ఏ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ సభ్యురాలు డా. కె. అనితా రెడ్డి వయోవృద్ధుల చట్టపరమైన హక్కులు, సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉన్న వేదికలపై వివరించారు. హనుమకొండ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వి. నరేందర్ న్యాయ సహాయం పొందే విధానాన్ని వివరించగా, జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ వయోవృద్ధుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, సేవల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు యెన్. నర్సయ్య, కే. దామోదర్, టి. యుగేందర్, వి. దేవాచార్య, ఎఫ్.ఆర్.ఓ రవి కృష్ణతో పాటు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు, వయోవృద్ధులు, సిబ్బంది పాల్గొన్నారు.



## నూతన ఎస్సై రమేష్ బాబును సన్మానించిన టియుడబ్ల్యూజె ( ఐజేయు )

**అక్షరశక్తి, గూడూరు:** గూడూరు నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన సిహెచ్ రమేష్ బాబును టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో శాంతిభద్రతల పరిరక్షణలో జర్నలిస్టుల సహకారం ఉంటుందని, మీడియా విధులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖకు జర్నలిస్టులు ఎప్పుడూ అండగా ఉంటామని చెప్పారు ప్రజాక్షేత్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై, పరస్పర సహకారంపై అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలోగూడూరు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) గూడూరు మండల అధ్యక్షులు గుర్రపు యాకాంబ్రం, జిల్లా ఉపాధ్యక్షులు ముక్తవరం సత్యనారాయణ, కోరే పాపయ్య, మండల నాయకులు బూరుగు నవనీత్ కుమార్, భీమగాని యాదగిరి, మంతాపురం యాకయ్య, ఎల్లంకి వెంకటేష్, భూక్య మోహన్, అరకాల రాజేందర్, పానుగంటి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల సంఘం కార్యదర్శిని కలిసిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**అక్షరశక్తి, హనుమకొండ:** భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ ను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని హరిత కాకతీయ వద్ద భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ ను జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి వరంగల్, ములుగు జిల్లాల్లో పర్యటన సందర్భంగా హనుమకొండలోని హరిత కాకతీయకు భారత ఎన్నికల సంఘం కార్యదర్శి చేరుకోగా హనుమకొండ జిల్లా కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ ఎన్.రవి, వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ , ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై చర్చించారు. శుక్ర, శనివారాలు వరంగల్, ములుగు జిల్లాల్లో పర్యటన సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో క్లెయిమ్ లు, అభ్యంతరాలపై భారత ఎన్నికల సంఘం కార్యదర్శి సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి బిఎల్వోలతో చర్చిస్తారు. భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో హనుమకొండ తహసిల్దార్/ఏఈఆర్ఓ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, ఇతర అధికారులు ఉన్నారు.

## ఏసీబీకి పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి

**అక్షరశక్తి, మంచిర్యాల :** రాష్ట్రంలో అవినీతి తిమింగిలాలు ఏసీబీ వలకు చిక్కుకుంటు న్నాయి. నిన్న ఇద్దరు ఉద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడగా శుక్రవారం నాడు మంచిర్యాల జిల్లాలో పంచాయతీ కార్యదర్శి పట్టుబడ్డారు. జిల్లాలోని జన్నారం మండలంలో శుక్రవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. లింగయ్యపల్లె గ్రామపంచాయితీ కార్యదర్శి వరలక్ష్మి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఓ వ్యక్తి ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం రూ.11 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు రావడంతో ఏసీబీ అధికారులు మాటువేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తీసుకున్న లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు ఆమెపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

21-08-2026_Layout 1 21-08-2026 19:09 Page 6



# మంత్రి కొండా సురేఖను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

## రేవంత్ నిర్ణయాలను వ్యతిరేకించే వాళ్లకి పార్టీలో ఉండే అర్హత లేదు

### 18మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్



**అక్షరశక్తి, హైదరాబాద్ :** మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీకి చెందిన 18 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తీవ్రంగా ఖండించారు. మంత్రి కొండా సురేఖను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కొండా సురేఖ భాష ఎప్పుడూ పార్టీకి నష్టం కలిగించే విధంగానే ఉందని, కేటీఆర్, సమంత అంశంలో కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కూడా పార్టీకి తలనొప్పిగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ సభ్యులు కానీ, అనామకులైన కొండా సుస్మిత కాంగ్రెస్ ఎమ్మెల్యేను పట్టుకొని అడ్డగోలుగా మాట్లాడుతుందని, ఇంతకంటే బజారు కల్చర్ ఎక్కడా ఉండదని పేర్కొన్నారు.
రేవంత్ రెడ్డి నిర్ణయాలను వ్యతిరేకిస్తున్న వాళ్లకి పార్టీలో ఉండే అర్హత లేదని స్పష్టం చేశారు. కొండా సురేఖకు నోటీసులు ఇస్తే, నా బిడ్డ మాటలకు నాకు సంబంధం లేదని బుకాయిస్తుందని ఆరోపించారు. సంబంధం లేకపోతే ముఖ్యమంత్రిపై కూతురు చేసిన వ్యాఖ్యలను ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. మీరు మాట్లాడుతున్న తప్పుడు భాషకు కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి మూల్యం చెల్లిస్తున్నారని, మీరు మాత్రం మీ పదవిని ఎంజాయ్ చేస్తూ పార్టీని ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డి ఎవరు రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడినా కఠిన చర్యలు తీసుకోవాలని అధిష్టానాన్ని కోరనున్నట్లు వెల్లడించారు. రాజగోపాల్ రెడ్డి ఎగిరెగిరి పడుతున్నాడు. మునుగోడు ఉప ఎన్నికల్లో నీ గతి ఏమైందో తెలుసు కదా అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విమర్శించారు. ఏ పార్టీలో అయినా సక్రమంగా గొడవలు లేకుండా ఉన్నావా కొండా సురేఖ? ఒక్క ఎమ్మెల్యేతో అయినా మంచి సంబంధాలు ఉన్నాయా ? నీ బిడ్డ మాట్లాడుతుంటే వెనుక బ్యానర్లో నీ ఫోటో ఉంటది, నీకు నీ బిడ్డ వ్యాఖ్యలకు సంబంధం లేదు అనడం ఏంటి? అంటూ విమర్శలు చేశారు. ఇంకెన్ని రోజులు నీ బ్లాక్‌మెయిల్‌తో పాలిటిక్స్ నడిపిస్తావని దుయ్యబట్టారు. పార్టీలోనే కొన్ని గుంట నక్కలు కొండా సురేఖ వెనకాల ఉన్నాయని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి రక్తం తాగింది చాలు పార్టీ నుంచి వెళ్లిపోవాలని కొండా సురేఖకు సూచించారు. పార్టీ బహిష్కరించక ముందే వెళ్లిపోతే మంచిదని హితవు పలికారు. మీడియా సమావేశంలో నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, బీర్ల ఐలయ్య , మధుసూదన్ రెడ్డి , రేవూరి ప్రకాష్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, మందుల సామెల్, వెడ్మ బొజ్జు, వేముల వీరేశం, బుయ్యని మనోహర్ రెడ్డి , కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, బత్తుల లక్ష్మా రెడ్డి , బాలు నాయక్ , వీర్లపల్లి శంకర్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి , చిక్కుడు వంశీకృష్ణ ,బల్మూరి వెంకట్, బస్వరాజు సారయ్య, పాల్గొన్నారు.



# నర్సంపేటలో డీఎంహెచ్ఓ డా. బి. రాజారెడ్డి తనిఖీలు

**అక్షరశక్తి, నర్సంపేట :** వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజారెడ్డి శుక్రవారం నర్సంపేటలోని టి-హబ్‌ను సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించడంతో పాటు, సేకరించిన నమూనాలు, నమూనాల సేకరణ సమయం, సేకరించిన నమూనాలు టి-హబ్‌కు చేరుతున్న సమయం తదితర అంశాలను పరిశీలించారు. పరీక్షా నమూనాల సేకరణ, రవాణా ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నర్సంపేట పి పి యూనిట్ లో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, ఆశా కార్యకర్తలతో మాట్లాడారు. వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన పనితీరు సూచికలను సమీక్షించి, అన్ని ఇండికేటర్లలో మెరుగైన పనితీరు సాధించేలా క్షేత్రస్థాయిలో సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని సూచించారు. ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల సేవలు చేరేలా కృషి చేయాలని ఆదేశించారు.
తదుపరి నర్సంపేటలోని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులతో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్, 2011, సంబంధిత రూల్స్--2022 అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డా. బి. రాజారెడ్డి మాట్లాడుతూ, ప్రతి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ తప్పనిసరిగా చట్టం, నిబంధనలను పాటించాలని తెలిపారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, వాటికి సంబంధించిన టారిఫ్ వివరాలను స్పష్టంగా ప్రదర్శించే బోర్డులను రిసెప్షన్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు, ధరలు మరియు ఇతర అవసరమైన వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లో రోగులకు నాణ్యమైన, పారదర్శకమైన వైద్య సేవలు అందేలా సంబంధిత నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలను ఉల్లంఘించే పరిస్థితులు తలెత్తకుండా ఆసుపత్రుల యాజమాన్యాలు ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ సూచించారు. ఈ కార్యక్రమంలో డా. ప్రకాష్, డి ఐ ఓ /డిప్యూటీ డి ఎం ఎచ్ ఓ, ఎస్ ఓ ప్రసన్న కుమార్, ఎల్ డి కంప్యూటర్ వెంకటేశ్వర్లు, నాగరాజు, సంబంధిత వైద్యాధికారులు, సిబ్బంది, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, ఐ ఎం ఎ సభ్యులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ జీ.ఓ 97 ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలి

అక్షరశక్తి, వరంగల్ : పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో శక్తిలో పాలిటెక్నిక్ కాలేజీని విలీనం చేయొద్దని ఐ టి ఐ కాలేజ్ నుండి ములుగు రోడ్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి జంక్షన్ లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగాపి డి ఎస్ యు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుర్రం అజయ్, మర్రి మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యను శక్తిలో విలీనం చేయడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన పాలిటెక్నిక్ జీవో నెంబర్ 97ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విద్యను కలపడం ద్వారా ప్రైవేట్ గవర్నమెంటుతో నడుస్తున్నందున విద్యార్థి తల్లిదండ్రులు అధిక ఫీజు భారానికి గురవుతారని, అంతేకాకుండా పాలిటెక్నిక్ విద్యార్థులను నైపుణ్య నేర్చుకునే విద్యార్థులుగా కాకుండా టాటా, మహేంద్ర, టయోటా, అశోక్ లేలాండ్ లాంటి కార్పొరేట్ మాన్ఫచరింగ్ చేసే కంపెనీలకు కార్మికులను తయారు చేసే ట్రేనర్స్ గా తీర్చిదిద్దడం బాధాకరమైన విషయమని అన్నారు. తక్షణమే పాలిటెక్నిక్ విద్యను శక్తిలో కలిపే నిర్ణయాన్ని వెనక్కి తీసుకుపోతే పి డి ఎస్ యు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా కమిటీ సభ్యులు వంగేటి మోహన్, ఫర్హాన్ నాయకులు మహేందర్,అఖిల్ సురేష్,లక్ష్మణ్,స్వరాజ్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.




Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.